



# అబద్ధమే వ్రాయవలెను

"న్యూస్ పేపర్ అనగా నేమి?" అని ప్రశ్నించి, ఎఫెక్ట్ కోసం కాసేపు ఆగాడు పంచాపకేశన్.




ప్రజాగోల కార్యాలయంలో హఠాత్తుగా పంచాపకేశన్ అనే శాల్తీ ప్రవేశించింది. ఈ పంచాపకేశన్ ఎడిటర్ త్రయంబకం బావ మరిది.

ఇతగాడు రైల్వేలో పని చేసి రిటైర య్యాడు. రైల్వేలో వుండగా రైల్వే టైంటేబుల్ ఎడిట్ చేశాట్ట. అందువల్ల అతనూ జర్న లిస్టేనని త్రయంబకం నమ్మకం.

పోతే, ఆఫీసులో డిసిప్లిన్ అట్టే లేదని, తను ఎడిటోరియల్స్ రాయడం మీద విపరీతంగా శ్రద్ధవహిస్తున్న సందర్భంలో స్టాఫ్ మీద ఓ కన్ను వేసి వుండటానికి తనకి కుడిభుజం అవసరమని భావించి, బావమరిది పంచా పకేశన్‌ని తన కుడిభుజంగా అపాయింట్ చేశాడు.

జర్నలిస్టులకి బచావత్ అనే ఆయన పేస్కేళ్ళు నిర్ణయించాడు. అయితే ఆయన కుడిభుజం అనే పోస్టుకి ఎంత జీతం ఇవ్వాలో చెప్పలేదు. అంచేత పంచాపకేశన్‌కి స్కేల్ ఫిక్స్ చెయ్యడంలో పర్సనల్ మేనేజర్ చాలా అవస్థపడాల్సి వొచ్చింది. కుడి భుజానిక్కాక పోతే ఎడం భుజానికి ఎంతివ్వాలో తెలిస్తే అంతకన్నా ఓ పదిరూపాయలు ఎక్కువ ఇవ్వచ్చులే అనుకున్నాడు గానీ బచావత్ ఎడం భుజానికి కూడా స్కేల్ ఫిక్స్ చెయ్యలేదు. అంచేత ఎంతో కొంత స్కేలు ఫిక్స్ చేశాడు పర్సరల్ మేనేజర్.

ఈ పంచాపకేశన్ అనే పేరే ప్రజాగోల ఆఫీసులో ఎవరికీ అర్థం కాలేదు. కొంత మంది దాన్ని 'పంచపీకేశాన్' అయి వుంటుంది అని అభిప్రాయపడ్డారు. అయితే పంచపీకేశాన్ అని పాస్టుటెన్స్‌లోగానీ పీకేస్తా అని ఫ్యూచర్‌టెన్స్‌లో గానీ ఎవరైనా ఎందుకు పేర్లు పెట్టుకుంటారో వాళ్ళకి అర్థం కాలేదు. ఒకవేళ పంచపీకెయ్యడం వాడి వృత్తేమో అని కొంతమంది అనుమానం వ్యక్తం చేశారు. అప్పటి నుంచీ పంచలు కట్టుకువొచ్చేవాళ్ళు ఎందుకైనా మంచిదని కాస్త జాగర్తగా వుంటున్నారు.

ఆ రోజు పంచాపకేశన్ ఎడిటోరియల్ స్టాఫ్ మీటింగు పెట్టి రైల్వే టైంటేబుల్ ఎడిటింగ్‌లో తనకున్న అనుభవం దృష్ట్యా పేపర్ని ఎలా డివలప్ చెయ్యాలి అనే అంశం మీద ప్రసంగిస్తున్నాడు.

ఆయనకి తెలియక తమని అడుగు తున్నాడని అపార్థం చేసుకున్నాడు కబ్‌రిపో ర్టర్ కమలనాథం.

''న్యూస్ పేపరు రైల్వే టైంటేబుల్‌కి ఆపోజిట్ సార్'' అన్నాడు.

పంచాపకేశన్ నిర్ఘాంతపోయాడు ఆ సమాధానం విని.

"ఏలనప్పా? ఏల అలా అంటివి?' అన్నాడు.

"వెరీ సింపుల్ సార్! రైల్వే టైంటేబుల్ నిండా అబద్ధాలు రాస్తారు. ఫలానా టైముకి ఫలానా రైలు వొస్తుందంటారు. అది చచ్చినా రాదు. నీ బాబుతో చెప్పుకో అంటుంది. అదే మనం అబద్ధం రాశాం అనుకోండి మన ఆఫీసు మీదకి గూండాల్ని పంపిస్తారు. వాళ్ళొచ్చి మన కాళ్ళూ చేతులూ విర గ్గొడతారు. అదే రైల్వే వాడు అబద్ధాలు రాసినా వాడి మీదకి గూండాల్ని పంపరు– పంపినా రైలు మనిషికాదు గనక కేర్ చెయ్యదు. అలా తన ఇష్టం వొచ్చినప్పుడు వొస్తూనే వుం టుంది. అంచేత ఎందులో అయితే అబద్ధాలు రాస్తారో దాన్ని రైల్వే టైంటేబుల్ అంటారు. ఎందులో అయితే నిజాలు రాస్తారో దాన్నే న్యూస్ పేపర్ అంటారు" అని ముగించాడు కమలనాథం.

ఇంత గబగబా తెలుగు మాట్లాడేస్తే పంచాపకేశన్‌కి అర్థంకాదు. అయినా తన అభిమాన పత్రిక అయిన రైల్వే టైంటేబుల్‌ని ఏదో తిడుతున్నాడనే విషయం మాత్రం గుర్తించాడు.

"ఏం అప్పా రైల్వే టైంటేబుల్ అంటే మజాకా అనుకొంటివా దానికున్న సర్క్యు లేషన్ ఏ పేపర్‌కి వుంది?" అన్నాడు పంచాపకేశన్.

ఈ ప్రశ్నకి ఏం సమాధానం చెప్పాలో ఎవరికీ అర్థం కాలేదు.

అప్పుడు పంచాపకేశన్ మళ్ళీ చెప్పాడు.

"నిజం అబద్ధం తరవాత చూసు కుంటాం. రైల్వే టైంటేబుల్ మాదిరిగానే అబద్ధాలు రాయండి. మనకి సర్క్యులేషన్ ముఖ్యం. గూండాల్ని కావాలంటే నేను తెస్తాను. మనంకూడా అవసరమైతే కొట్టవలె అబద్ధాలే రాయవలె."

అప్పుడు గుర్నాథం చెప్పాడు ఓ సెన్సేషనల్ వార్త.

"పాత బస్తీలో ముఖ్యమం త్రిని పొడి చిన ప్రతిపక్ష నాయ కుడు. ప్రతిపక్షనాయకుణ్ణి పొడి చిన కాంగ్రెస్ అధ్యక్షుడు. కాంగ్రెస్


జొన్నలగడ్డ రాధాకృష్ణ

'అధ్యక్షుణి పొడిచిన సినిమా హీరో చిరం జీవి."

"ఎలా వుంది సార్ ఈ వార్త?" అన్నాడు గుర్నాధం.

పంచాపక్శన్ ఆనందం పట్టలేక పోయాడు.

''న్యూస్ అంటే ఇలా వుండవలె. ఇట్లాదా రాయవలె. అప్పుడుదామన సర్క్యులేషన్ నిండా పెరుగును. అవును ఇదంతా నిజందానా?'' అన్నాడు.




''నిజందానా కాదు సార్. ప్యూర్ అబద్ధం. రైల్వే టైంటేబుల్‌లో వేసే అబద్ధాలి లాంటి కల్తీలేని నికార్సయిన అబద్ధం. కానీ ఇది వేశాం అంటే సర్క్యులేషన్ భయంకరంగా పెరిగిపోతుంది సార్'' అన్నాడు గుర్నాధం.

''నిండా బాగుంది. అబద్ధం అయితే తరవాత చూసుకుంటాము. ముందు స్టోరీ రాసెయ్యండి. అదిదా మన పేపర్ బానర్ ఈ రోజు. దీనితో మన పేపర్ నంబర్ వన్ అయిపోవును'' అన్నాడు పంచాపక్శన్.

సరిగా అదే టైములో లోపలికి వచ్చిన ఎడిటర్ త్రయంబకం అతగాడి చివరి డైలాగులు విని నెత్తీ నోరూ బాదుకున్నాడు.

''ఇప్పటి దాకా పంచాపక్శన్ చెప్పింది అంతా మర్చిపోండి. వాడా చెప్పినట్టు రాస్తే వాడికీ మీకూ ఏం కాదు. ప్రింటర్, పబ్లిషర్ ఎడిటర్ అయిన నన్ను వురితీస్తారు. పంచాపక్శన్ స్పీచ్ మొత్తం కాన్సిల్ చేస్తున్నాను'' జైహింద్ అని పంచాపక్శన్‌ని చొక్కాపుచ్చుకుని బరబరా లాక్కుపోయాడు లోపలికి.

''ఈయన అనవసరంగా చివరి నిముషంలో వచ్చాడు లేకపోతే ఆ స్టోరీ రాసెస్తే చక్కగా ఎడిటర్ గార్ని లోపల తోసేసేవారు. పేపరైనా బాగుపడేది'' అన్నాడు గుర్నధం దిగులుగా.

"పోన్లే ఒక మంచి జరిగింది. త్రయంబకం వాణ్ణి లోపలికి లాక్కుపోయాడుగా. ఓ పది పద్యాలు వినిపించేస్తాడు. దాంతో ఈ పంచాపక్శన్ గాడు జీవచ్ఛవంలా, బుద్ధిమాంద్యం వాడిలా మారిపోతాడు. ఈ ఉద్యోగం వొదిలి మళ్ళీ పోయి రైల్వే టైంటేబుల్ ఎడిటింగ్ చేసుకున్నా చేసుకుంటాడు. కనీసం ఒక తద్దినం వొదిలినా వొదిలినట్టేగదా" అన్నాడు సుబ్బారావు.

గుర్నాధం తల అడ్డంగా తిప్పాడు.

"మనం అంత అదృష్టానికి నోచుకోలేదు. ఈ పంచాపక్శన్‌కి తెలుగు రాదు. అంచేత త్రయంబకం తన కవిత్వం ద్వారా తెలుగు భాషకి చేస్తున్న అపకారాన్ని అర్థం చేసుకోలేడు. అందువల్ల వీడు పరిపూర్ణ ఆరోగ్యంతో బయటికి వొస్తాడు" అన్నాడు.

గుర్నాథం చెప్పిందే రైటయింది. పంచాపక్శన్ ఆరోగ్యానికి ఎలాంటి హానీ జరగలేదు. లోపల ఏం జరిగిందో తెలియదు గానీ–త్రయంబకం పద్యాలు వినిపించి వుంటాడనడంలో ఎవరికీ ఎలాంటి సందేహం లేదు. అయినా త్రయంబకం పద్యాలు వినికూడా ఎలాంటి వికారానికీ గురి కాకుండా బయటికి వచ్చిన మొట్టమొదటి వ్యక్తి అతను. గిన్నీస్ రికార్డు బుక్కులో ఆ క్షణంలో అతను ఎక్కేశాడు. అయితే ఆ విషయం అతనికి గానీ గిన్నీస్ వాళ్ళకి గానీ ఆ క్షణంలో తెలియదు.

"మీ ఎడిటర్ నిండా మోసంగా వున్నాడప్పా. అబద్ధం రాయమాలదు అంటున్నాడు. నిజం రాస్తే పేపర్ ఎవడుదా కొంటాడప్పా" అని దిగులు పడుతున్నాడు పంచాపక్శన్.

"నిజమేసార్. మన ఎడిటర్‌గారికి ఏం తెలీదు సార్! తమరు ఎడిటర్ కాగానే పేపర్ నిండా హోల్ మొత్తం అబద్ధానే రాసేద్దాం సార్. అప్పుడుదా మన పేపర్ సర్క్యులేషన్ నిండా పెరుగును సార్ అన్నాడు గుర్నాధం.

"అట్లుదా చేయవలె అన్నాడు పంచాపకేశన్.

మధ్యలో అట్లు ఎందుకు చేయాలో అర్థం కాలేదు గుర్నాధానికి. ◆

# వింత ప్రపంచం



## సర్పభక్షకుడు

దక్షిణ ఆఫ్రికాలోని జోహన్స్‌బర్గ్‌లో ఓ విచిత్రమైన వ్యక్తి వున్నాడు. విష సర్పాలు తినడం అతని హాబి! జీవంతో వున్న సర్పాలను తినడం మరో విశేషం! నోట్లో పెట్టుకొని నమిలి మింగేస్తూ వుంటాడు.

32 సంవత్సరాల ఈ సర్ప భక్షకుడి పేరు లిజ్వి. కోపంతో బుసలు కొట్టే సర్పాలను తినడమంటే అతనికి బహు ఇష్టం.

పాము విషం తనపై ఎలాంటి ప్రభావం చూపెట్టదని అతను అంటాడు. తనే ఓ విష సర్పం లాండివాడినని, తాను ఎవ్వరినైనా కాటేస్తే — బ్రతికే అవకాశం లేదని అతను అంటాడు. 12 ఏళ్ళ నుంచి అతను సర్పాలను తినడం ప్రారంభించాడు.

సర్పాలను పిలిచే సమ్మోహనశక్తి తనకు వుందని, తను పిలగానే సర్పాలు పరుగెత్తుకొస్తాయని అంటాడు లిజ్వి.

చేపలను తింటే ఎలా రుచిగా వుంటాయో సర్పాలను తిన్నా తనకు అలాగే రుచిగా వుంటుందని అంటాడతను. సర్పాలు కాటేసినప్పటికీ లిజ్వీకి విషం ఎక్కదు. భలే వింత మనిషి కదూ!

— రజియా